గాలిబండ.. మందుబాబుల అడ్డా!

- హార్సిలీహిల్స్‌పై మూడు గొడుగులు ధ్వంసం
- పగిలిన మద్యం సీసాలు, చెత్త
- చీకటిపడితే అరుపులు, కేకలు


గాలిబండపై పగిలిన మద్యం బాటిళ్ల గాజు పెంకులు


మందుబాబులు ధ్వంసం చేసిన సిమెంటు బెంచీలు (ఫైల్)

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ గాలిబండ మందు బాబుల విందు, మందుకు అడ్డగా మారిపోయింది. కొండపై ఆహ్లాదకరమైన గాలిబండపై కుటుంబాలతో సందర్శకులు రావాలంటే జడుసుకొంటున్నారు. మందు బాబులను కట్టడి చేసే వారే లేక స్వైరవిహారం చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ ఏర్పాటు చేసిన మూడు గొడుగులు, వాటికింద నిర్మించిన సిమెంటు బెంచీలను ధ్వంసం చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఈ పరిస్థితులపై సందర్శకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

గాలిబండ నిండా గాజుపెంకులే

హార్సిలీహిల్స్‌పై సందర్శకులు వ్యూపాయింట్లు, గాలిబండ, గవర్నర్‌బంగ్లా, అటవీప్రాంగణం నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తారు. వీటిలో గాలిబండపై వీచే చల్లటి గాలిని ఆస్వాదించేందుకు సందర్శకులు ఆసక్తి చూపుతారు. అలాంటి చోట మందుబాబుల విందులకు నిలయంగా మారింది. చీకటిపడితే మద్యం తెచ్చుకొని విందులు చేసుకోవడం, మైకంలో మద్యం ఖాళీ బాటిళ్లను పగలగొడుతున్నారు. వీరి విందు, వినోదం ఫలితంగా గాలిబండ నిండా పగిలిన మద్యం బాటిళ్ల గాజుపెంకులే దర్శనమిస్తున్నాయి. సందర్శకులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా గాజు పెంకులు కుచ్చుకొని గాయపడడం ఖాయం. ఇలాంటి పరిస్థితుల మధ్య సందర్శకులు కుటుంబాలతో వచ్చేందుకు అనక్తి చూపడం లేదు.

మూతపడ్డ టూరిజం పోలీస్‌స్టేషన్

హార్సిలీహిల్స్‌పై బ్రిటీష్‌హయాంలోనే పోలీస్‌స్టేషన్ ప్రారంభించారు. వారికి నివాస గృహలు కూడా నిర్మించారు. తర్వాత దీన్ని పోలీసు ఔట్‌పోస్టు సద్వినియోగం చేసుకోగా, 24 ఏళ్ల క్రితం మూతపడింది. అప్పట్లో ఒక హెడ్‌కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్ల నిత్యం విధుల్లో ఉండేవాళ్లు. స్టేషన్‌లో ఫోన్ అందుబాటులో ఉండేది. ఆంధ్ర ఊటీగా పేరుగాంచిన హార్సిలీహిల్స్‌లో సేదతీరేందుకు వేల సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. వీఐపీలు, ప్రజాప్రతినిధులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వీరి భద్రతను దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం టూరిజం పోలీసు కేంద్రాన్ని ప్రారంభించింది. అయితే కొంత కాలానికే మూత పడింది. సిబ్బంది కొరత కారణంగా నియామకం చేపట్టలేదు. ప్రస్తుతం పోలీసు ఉన్నతాధికారులు స్పందించి హార్సిలీహిల్స్‌పై నెలకొన్న పరిస్థితులను సమీక్షించి భద్రత కల్పించడం ద్వారా మందుబాబుల ఆగడాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఆస్వా నూతన కమిటీ ఏకగ్రీవం

పీలేరు : అమ్మ స్వచ్ఛంద సేవా సమితి (ఆస్వా), పీలేరు నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు చీనేపల్లె నాగేంద్ర తెలిపారు. మంగళవారం పీలేరులో సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెడ్డిశేఖర్, ఉపాధ్యాక్షుడిగా నరసింహ, కార్యదర్శిగా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా పవన్‌కుమార్, కోశాధికారిగా తరుణ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఆయిల్‌సీడ్స్ స్థలం పరిశీలన

పీలేరురూరల్ : పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు మార్గంలో శ్రీకృష్ణదేవరాయుల నూనెవిత్తుల కర్మాగార స్థలాన్ని రాయచోటి ఆర్డీఓ ఎ. శ్రీనివాస్ పరిశీలించారు. ఏపీ ఆయిల్ సీడ్స్ వారు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం మేరకు మంగళవారం ఆర్డీఓ ఆయిల్ సీడ్స్ స్థలాన్ని పరిశీలించారు. గూడరేవుపల్లె పంచాయతీ సర్వే నంబరు 199/2లో 17.78 ఎకరాలు, ఎర్రగుంటపల్లె పంచాయతీలో 743/బీ1లో 1.1 ఎకరాలు మొత్తం 18.79 ఎకరాల స్థలాన్ని, భవనాలను పరిశీలించారు. ఆయిల్ సీడ్స్‌కు సంబంధించి స్థలం, భవనాల వివరాలు నివేదిక తయారు చేసి పంపాలని తహసీల్దార్ భీమేశ్వర్‌రావును ఆదేశించారు. అనంతరం ఏపీ బాలికల గురుకుల పాఠశాలను ఆర్డీఓ తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యత పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

మత్తు పదార్థాల నివారణే లక్ష్యం


మాదక ద్రవ్యాల వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ యుగంధర్

పీలేరురూరల్ : మత్తు పదార్థాల నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఐ యుగంధర్ తెలిపారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమృతతేజ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక పోస్టర్‌ను సీఐ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు సాయి సంపత్‌కుమార్, ఇమ్రాన్, మోహన్, అఖిల్, శివ, లోకేష్ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం


మాట్లాడుతున్న రూరల్ సీఐ రమేష్

కురబలకోట: ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితాలు నాశనమవుతాయని మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ రమేష్ హెచ్చరించారు. ర్యాగింగ్ వద్దు.. భవిత ముఖ్యంగా ముందుకు సాగాలని సూచించారు. మంగళవారం ఆయన అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో యాంటి ర్యాగింగ్‌పై జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ర్యాగింగ్ కలవరపెట్టేదిగా మారిందన్నారు. విద్యార్థులు కేరీర్‌పై ప్రధానంగా దృష్టి సారించాలని హితువుపలికారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు.

ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: ఉద్యోగులు సమిష్టి కృషితో ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం డిపో కార్యాలయలంలో సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. అక్టోబర్ నెలలో ఈపీకే 38.66, ఓఆర్ 72, కేఎంపీఎల్ 5.37 సాధించి రీజియన్‌లో మొదటి స్థానం నిలిచినట్లు తెలిపారు. శబరిమల, అరుణాచలంకు ప్రత్యేక స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. సమావేశంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

నిమ్మనపల్లె : అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఉదయం బైరెడ్డిపల్లెకు చెందిన డ్రైవర్ శంకర టిప్పర్‌లో ఇసుక లోడ్ చేసుకుని వస్తుండగా, పోలీస్‌సిబ్బంది వాహనాన్ని ఆపి విచారించారన్నారు. ఇసుక తరలింపుకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నామనిని తెలిపారు. డ్రైవర్ శంకర్, ఓనర్ అశోక్‌లపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

నివాళి


ఇంద్రావతమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల, తదితరులు

కలికిరి (వాల్మీకిపురం): మండలంలోని గండబోయనపల్లికి చెందిన మాజీ సర్పంచ్ సురేంద్రరెడ్డి సతీమణి రమాదేవి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మంగళవారం గండబోయనపల్లిలో రామాదేవి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మూరేవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.ఎస్.రఘునాథరెడ్డి, తల్లి ఇంద్రావతమ్మ మృతి చెందిన సమాచారం తెలుసుకుని మూరేవాండ్లపల్లిలో ఆమె భౌతికకాయానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

పెద్దతిప్పసముద్రం: స్థానిక మోడల్ స్కూల్‌లో మంగళవారం వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ రియాసత్ అలీఖాన్ కుమార్తె డాక్టర్ అస్రాఖాన్ విద్యార్థులకు ఆహారపు అలవాట్లు, ఆరోగ్య సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, అండగా ఉంటామని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. వాల్మీకిపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నెలల వ్యవధి లోనే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పతాక స్థాయికి చేరిందని, ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించిన సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేసి వేధిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని, అధికార పార్టీ అరాచకాలకు, అక్రమాలకు కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నియోజకవర్గంలో పార్టీకి తిరిగి పూర్వవైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతల శివానందరెడ్డి, బరకం రవికుమార్‌రెడ్డి, హబీబ్ బాషా, బిడ్డల కేశవరెడ్డి, నీళ్ల భాస్కర్, అబ్దుల్ కలీం, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వెంకటర మణారెడ్డి, చక్రధర్, లక్ష్మీనారాయణరెడ్డి, రాంప్రసాద్‌నాయుడు, నరసింహులు, కమలాకర్ రెడ్డి, మస్తాన్‌రెడ్డి, అప్పల్లా పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

తంబళ్లపల్లె : గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం కన్నెమడుగు, ఎద్దులవారిపల్లె సచివాలయాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, రికార్డులను పరిశీలించారు. ప్రజల నుంచి సమస్యలపై వచ్చే అర్జీలను పరిశీలించి వాటి పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడే మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు సుశీల, జ్ఞానారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా నాగుల చవితి పూజలు

రామసముద్రం : మండలంలో నాగులచవితి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు నాగపడగలు, పచ్చిదారాలు, నువ్వులు, పచ్చిబియ్యం పిండితో తయారుచేసిన వాటిని పుట్టల వద్దకు వెళ్లి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. పాలు, పండ్లు, గుడ్లు, పసుపు, కుంకుమ పుట్టలకు పచ్చిదారం చుట్టి నైవేద్యాలు, నోముచీరలు సమర్పించారు.

నైపుణ్య గణనపై శిక్షణ

బి.కొత్తకోట : నైపుణ్య గణనలో భాగంగా ప్రతిఇంటిలో 15–59 ఏళ్ల వయసు కలిగిన వారి వివరాలను సేకరించాలని ఎంపీడీఓ శంకరయ్య సూచించారు. మంగళవారం మండలంలోని సచివాలయాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వివరాలను సేకరించడం ద్వారా ప్రాంతీయ పరిశ్రమల ఏర్పాటుకు మార్గం ఏర్పడుతుందన్నారు. నైపుణ్య సర్వేలో విద్యార్హత, సాంకేతిక అర్హతలపై వివరాలను సేకరించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ వివరాల సేకరణపై ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు సర్వేకు సహకరించాలని కోరారు.


ఆటో బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ములకలచెరువు : మండలంలో సోమవారం రాత్రి ఆటో బోల్తా పడ్డ ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. వేపూరికోటకు చెందిన చంద్ర (45) తన ఆటోలో ములకలచెరువుకు వెళ్లి పరుపు కొనుగోలు చేసి పరుపును ఆటోపై వేసుకుని స్వగ్రామానికి బయలు దేరాడు. ఈ నేపథ్యంలో ఆటో పెద్దపాళ్యం గేటు వద్దకు రాగానే ఆటో పైనున్న పరుపు అద్దాలకు అడ్డు రావడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

మాలల సింహ గర్జనను జయప్రదం చేయండి

పీలేరురూరల్ : రాజ్యాంగ హక్కు పరిరక్షణ కొరకు ఈ నెల 26న గుంటూరులో నిర్వహించినున్న మాలల సింహ గర్జనను జయప్రదం చేయాలని మాలమహానాడు ఐక్యవేదిక మండల అధ్యక్షుడు చీకటిపల్లె మల్లికార్జున పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మారంరెడ్డిగారిపల్లెలో మాల మహానాడు నాయకులు సింహ గర్జనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం నాయకులు నారాయణ, రామాంజులు, వెంకటరమణ, రామచంద్రయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు


బిక్కావాండ్లపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయం

పెద్దమండ్యం : పెద్దమండ్యం పంచాయతీ బిక్కావాండ్లపల్లెలో శ్రీ సీతారామ లక్ష్మణ హనుమ సమేత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. పల్లెలో ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహాయంతో గ్రామస్థుల సహాయ సహకారాలతో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో తిరుమల తిరుమల తిరుపతి దేవస్థానం వారు అందజేసిన సీతారామ లక్ష్మణ హనుమంతుని విగ్రహాలను వేదపండితుల మంత్రోచ్చారణలతో ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. ఆలయం అత్యంత ప్రతిష్టాత్మకమైన శిల్ప కలా నైపుణ్యంతో అమృత శిలామయమై ఆలయ నిర్మాణం చేపట్టారు. విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవం గురువారం భువనేశ్వరి పీఠం పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ చేతుల మీదుగా జరుగుతుందని వారు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిష్ట కార్యక్రమానికి భక్తులు, ప్రజలు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

రెవెన్యూ అధికారులు తీరు మార్చుకోవాలి

కలికిరి: రెవెన్యూ అధికారులు తీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారుల తీరుపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులు సమస్యలతో వచ్చే రైతుల పట్ల వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఎంపీడీఓ భానుమూర్తిరావు, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

పీలేరు : ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మంచి నీరు, వీధి లైట్లు, మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా


పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన ఎస్ఈ

బి.కొత్తకోట : వ్యవసాయం, గృహ, వాణిజ్య రంగాలకు మెరుగైన విద్యుత్ సరఫరాను అందిస్తున్నామని డిస్కం జిల్లా ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా రూ.70 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అదనపు 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ సరఫరా ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. కర్ణాటక సరిహద్దులోని ఈ ప్రాంతంలో వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. విద్యుత్ బకాయిల వసూళ్లు, సరఫరా లైన్ల నిర్వహణపై దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మదనపల్లె ఈఈ గంగాధరం, ట్రాన్స్‌ఫార్మర్స్ డీఈ రమేష్, ములకలచెరువు డీఈ గోవిందరెడ్డి, ఏఈ గిరిబాబు పాల్గొన్నారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మదనపల్లె : మండలంలోని సీటీఎం సబ్‌స్టేషన్‌లో నూతనంగా రూ.2 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో సీటీఎం సెక్షన్ పరిధిలోని ఏడు గ్రామాలకు నిరవధికంగా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గతంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా రెండు విడతలుగా ఇచ్చేవారమని, ప్రస్తుతం ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో రైతులకు 7 గంటలు నిరంతర విద్యుత్ అందిస్తామని చెప్పారు. ఈఈలు రమేష్, గంగాధరం, డీఈఈ ఆదినారాయణ, బి.సురేంద్రనాయక్, ఏఈ రమేష్ పాల్గొన్నారు.

మతవిద్వేషాలు రెచ్చగొట్టవద్దు


మాట్లాడుతున్న దళితహక్కుల పోరాటసమితి జిల్లా నాయకులు

మదనపల్లె : సనాతన ధర్మం పేరుతో మతవిద్వేషాలను రెచ్చగొట్టి, కొందరు రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని పలువురు ప్రజాసంఘాల నాయకులు, మేధావులు వ్యాఖ్యానించారు. దళిత హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు మంచాల హరికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఎస్టీయూ భవనంలో నేటి పరిస్థితుల్లో దేశానికి, యావత్ సమాజానికి ఏది అవసరం? సనాతన ధర్మమా? లౌకికవాద రాజ్యాంగమా ? అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. కార్యక్రమంలో దళితహక్కుల పోరాటసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధాకర్ మాట్లాడుతూ సనాతన ధర్మం పరిరక్షణ ప్రచారం వెనుక దుర్మార్గమైన ఉద్దేశం దాగి ఉందని హెచ్చరించారు. దీనిపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సనాతన ధర్మం పేరుతో వివాదాలకు దారితీస్తున్న పార్టీలు, వాటి నేతలకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వీసీకే, బాస్ వ్యవస్థాపకులు పీటీఎం.శివప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా పదవిలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సనాతనధర్మాన్ని కాపాడేందుకు ఒక సైన్యాన్ని తయారుచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యనమల సుదర్శనం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, బీఎస్పీ జిల్లా సెక్రటరీ శ్రీనాథ్, ఏఐఎస్ఎఫ్ మాధవ, బీకేఎంయూ డివిజనల్ సెక్రటరీ చంద్రశేఖర, దేవా, మనోహర్, చంద్రయ్య, ప్రసాద్, మారెప్ప పాల్గొన్నారు.

ప్రతిభ చూపే క్రీడాకారులకు ప్రోత్సాహం


రైతు బజార్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జేసీ ఆదర్శ రాజేంద్రన్

మదనపల్లె సిటీ: ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రోత్సాహించనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–14 వాలీబాల్ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన జట్లుకు రూ.10 వేలు నగదు, క్రీడాకారులకు వాలీబాల్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, పీడీలు దేవకమ్మ, జలజ, సుధాకర్,జ్యోతి, ఉపాధ్యాయులు మహమ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసమే రైతుబజార్

మదనపల్లె : రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరతో పాటుగా ప్రజలకు నాణ్యమైన, తాజా కూరగాయలు అందించాలనే ఉద్దేశంతో మదనపల్లెలో రైతుబజార్‌ను తిరిగి ప్రారంభించినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్ తెలిపారు. పట్టణంలోని సంతగేటు సమీపంలో ఆధునికీకరించిన రైతుబజార్‌ను మంగళవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ రైతులు తమ పంట ఉత్పత్తులను నేరుగా రైతుబజార్‌కు తీసుకువచ్చి తమకు నచ్చిన ధరకు విక్రయించుకోవచ్చని తెలిపారు.

సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న డీఏఓ చంద్రనాయక్, వ్యవసాయ అధికారులు

నిమ్మనపల్లె : సేంద్రియ వ్యవసాయంతో రైతులు నాణ్యమైన దిగుబడులను సాధించి, తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్ అన్నారు. మంగళవారం నిమ్మనపల్లి మండలంలో పర్యటించిన ఆయన రెడ్డివారిపల్లి లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మదనపల్లె ఏడీఏ శివశంకర్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ- పంటలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. రసాయనక ఎరువులు, పురుగుమందులను వినియోగించడంతో భూమిలో సారం తగ్గి పంటల నాణ్యత దిగుబడి తగ్గుతోందన్నారు. సేంద్రియ ఎరువులతో వ్యవసాయం ద్వారా భూ సారం పెరిగి , నాణ్యమైన పంట దిగుబడి లభిస్తుందని తెలిపారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతుకు ఈ–పంట ధ్రువీకరణ పత్రాలను వందశాతం రైతు సేవా కేంద్రాల ద్వారా అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మురళీ మోహన్, పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్, ఏఈఓ లక్ష్మి ప్రసన్న, వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, రెడ్డిబాబు, రెడ్డి కుమారి, రైతులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణల లెక్కలు తేల్చండి

మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు జేసీ ఆదేశాలు


మదనపల్లె : మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

మదనపల్లె : పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీకేఎం–ఉడా) పరిధిలోని పట్టణాల్లో ఎన్ని చెరువులున్నాయి, ఎంత మేర ఆక్రమణలకు గురయ్యాయో లెక్కలు తేల్చాలంటూ జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. పీకేఎం–ఉడా వైస్‌చైర్మన్‌గా నియమితులయ్యాక తొలిసారిగా జాయింట్ కలెక్టర్ స్థానిక కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీకేఎం–ఉడా పరిధిలోని పట్టణాల్లోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు గుర్తించాలని ఆదేశించారు. నగరాల్లో చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, ప్రజావసరాలకు నిర్దేశించిన స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. పలమనేరు, బి.కొత్తకోట, మదనపల్లె, పుంగనూరు, కుప్పంలో అభివృద్ధి పనులకు సంబంధించి అవసరమైన నిధులకు నివేదికలు తయారుచేయాలని పేర్కొన్నారు. అనధికార లేఅవుట్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని, తెలిసిన వెంటనే డీటీసీపీ కార్యాలయానికి సమాచారం తెలపడంతో పాటుగా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. మదనపల్లె పట్టణంలోని కోమటివానిచెరువు కట్ట బలోపేతం చేయడంతో పాటుగా పూడికలు తీయించి, నీటిని శుభ్రం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, కోమటివానిచెరువు అభివృద్ధికి రూ.2కోట్లు నిధులు మంజూరుచేయాలని కోరారు. బి.కొత్తకోట కమిషనర్ పల్లవి, డీఈ మహేష్, టీపీఓ కుముదిని, జకీరాఖాతూన్, ఏఈ స్నేహ ప్రియ పాల్గొన్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్ పూర్తి

అన్నమయ్య జిల్లాలో ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పూర్తయిందని, దీనికి సంబంధించి ప్రభుత్వానికి సమగ్రనివేదిక పంపామని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. చుక్కలభూముల దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనన్నారు. రెవెన్యూ విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అతిథి గృహం పూర్తికి చర్యలు

బి.కొత్తకోట: హార్సిలీహిల్స్‌పై రెవెన్యూ అతిథి గృహ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన హార్సిలీహిల్స్‌పై పర్యటించారు. అతిథి గృహం పరిశీలించి మరమ్మతు పనులకు ఎంత వ్యయం అవుతుందో అంచనా వేసి నివేదిక ఇవ్వాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పర్యాటకశాఖకు కేటాయించిన భూములను పరిశీలించిన ఆయన కంచె వేయాలని సూచించారు. స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించి పర్యాటకులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించి ఇక్కడి పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట టూరిజం డిప్యూటీ మేనేజర్ నేదురుమల్లి సాల్వీన్‌రెడ్డి, తహసీల్దార్ మహ్మద్ అన్సారీ, డీఈ సూర్యనారాయణ రెడ్డి, ఆర్ఐ వీరాంజనేయులు పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ

కేవీపల్లె : లైంగిక అంశాలపై తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎయిడ్స్ వ్యాధికి కారణమైన హెచ్ఐవీ నుంచి తప్పించుకోవచ్చని కోర్ సంస్థ ప్రతినిధి శైలజ అన్నారు. మంగళవారం మండలంలోని గర్నిమిట్ట పీహెచ్‌లో హెచ్ఐవీ, టీబీ వ్యాధులపై మీకు తెలుసా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ, టీబీ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సీహెచ్ఓ భాగ్యలక్ష్మీ, సూపర్‌వైజర్ పురుషోత్తం పాల్గొన్నారు.

నియామకంపై హర్షం

పెద్దతిప్పసముద్రం : భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) జిల్లా కో కన్వీనర్‌గా పని చేస్తున్న పాలకుంట శ్రీనివాసులును జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా జిల్లా కలెక్టర్ ఎంపిక చేశారు. శ్రీనివాసులును ఎన్నుకోవడం హర్షణీయమని మాజీ డీవీఎంసీ మెంబర్ కేవీ రమణ మంగళవారం ఆయన పేర్కొన్నారు.

పీలేరు : జిల్లా విజిలెన్స్, మానటరింగ్ కమిటీ సభ్యుడుగా బోధిషావలిని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి నియమించారు. బోధిషావలిని ఆర్ సాట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధిగా కమిటీలో చోటు కల్పించారు.

నాణ్యమైన ఆరోగ్య సేవలందించాలి

కేవీపల్లె : ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య సూచించారు. మంగళవారం మండలంలోని జిల్లేళ్లమంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. వైద్యాధికారి డాక్టర్ సాయిశిరీష, పీహెచ్ఎన్ లలిత పాల్గొన్నారు.